వ్యవసాయ జూదంలో టమోటా రైతు బలవుతూనే ఉన్నాడు. ఎప్పుడు ధర ఉంటుందో.. ఎప్పుడు పడిపోతుందో ఎవరికీ తెలియడం లేదు. సాగు ఖర్చులు పెరిగిపోవడం ధర పడిపోతుండటంతో టమోటా సాగు చేసే రైతులు నష్టాల పాలవుతూనే ఉన్నారు. ప్రస్తుతం రూ. కిలో రూ.6 నుంచి 7 పలుకుతుండటంతో గిట్టుబాటు కాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం చొరవ చూపి రైతుల నుంచి గిట్టుబాటు ధరకు కొని ఆదుకోవాలని కోరుతున్నారు.

టమోటా 'గిట్టుబాటు' అయ్యేనా.?

- ఎకరాకు రూ.3.50 లక్షల పెట్టుబడి
- కిలో రూ.6 తో నష్టాల పాలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు



రేట్లు వస్తాయన్న ఆశతో కోతలు కోయకుండా తోటల్లోనే ఉంచేసిన టమోటాలు



మదనపల్లె మార్కెట్లో విక్రయానికి వచ్చిన టమోటా

మదనపల్లె టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలతో పాటు చిన్నమండ్యం, సంబేపల్లె, దేవపట్ల, సుండుపల్లె ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా టమోటా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో 2 వేల ఎకరాల్లో మాత్రమే దిగుబడి వస్తోంది. సొంత భూమి ఉంటే దుక్కులు దున్నడం, మల్చింగ్ పేపర్ వేయడం, పాదులు తీయడం, నర్సరీ నుంచి మొక్కలు కొనుగోలు చేయడం, ఈ మొక్కలు ఏపుగా ఎదిగాక కట్టెలు కట్టడం, తీగలు అల్లుకునేందుకు ఆసరాగా దారం కట్టాలి. చీడపీడలు రాకుండా పలుమార్లు మందులు పిచికారీ చేయాలి. వీటితో పాటు ఎరువులు కలిపి డ్రిప్ పైపులతో నీటిని అందించాలి. వీటికంతా వెరసి ఎకరాకు రూ.3.50 లక్షల వరకు ఖర్చు వస్తోంది. తరువాత టమోట కోత కూలీలు, రవాణా ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తోంది. ఎకరా టమోటా సాగు చేస్తే గరిష్ఠంగా 800 క్రేట్లు (200 క్వింటాళ్లు) దిగుబడి వస్తుంది. అంటే పెట్టుబడి తిరిగి రావాలంటే కిలో టమోటా సరాసరి రూ.17.5 పలకాలి. కానీ మదనపల్లె, ములకలచెరువు, గుర్రంకొండ మార్కెట్‌లలో ప్రస్తుతం కిలో టమోటా కనిష్ఠంగా రూ.6, గరిష్ఠంగా రూ.13 మాత్రమే పలుకుతోంది. దీంతో రైతుకు ఎకరాకు రూ.1.70 లక్షలు నష్టం వస్తోంది. దీంతో చాలామంది రైతులు రేపో, మాపో ధరలు పెరగకపోతాయా అనే ఆశతో పంట కోతలు నిలిపివేశారు.

ప్రభుత్వం పైనే రైతుల ఆశలు

మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో, గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఇదే సమయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి టమోటా ధరపై ఆరా తీశారు. ధర తగ్గిపోతే తీసుకోవాల్సిన చర్యలు, గిట్టుబాటు ధర సాధ్యాసాధ్యాలపై విచారణ చేయాలని ఆదేశించారు. గత శనివారం మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో టమోటా రైతులతో చర్చించారు. ఎంత ధర ఇస్తే రైతులకు పెట్టుబడి తిరిగి వస్తుంది. ఒకవేళ ఎఫ్‌పీవోలు, ప్రభుత్వం ఎంత ధర చెల్లిస్తే రైతులు తోటల వద్దే టమోటా విక్రయిస్తారు, అనే అంశాలపై ఆరా తీశారు. దీనిపై వ్యవసాయ మార్కెటింగ్ ఏడీ త్యాగరాజుతో చర్చించి నివేదికలను ప్రభుత్వానికి పంపారు. రైతులేమో టమోటా కిలో రూ.13.5 నుంచి రూ.15 ధర పలికితేనే తాము బయటపడతామని తేల్చి చెప్పారు. కానీ మార్కెటింగ్‌శాఖ మదనపల్లె మార్కెట్ నుంచి కిలో రూ.8.46కు టమోటా కొనుగోలు చేసి నెల్లూరు, కావలి రైతుబజార్‌లకు తరలిస్తోంది. ఈ ధరలు గిట్టుబాటు కావని రైతులు చెబుతున్నారు.

సీజన్‌లో ఇదే పరిస్థితి ఉంటే..

టమోటా సీజన్ మార్చి ఆఖరు నుంచి జూలై వరకు నాలుగు నెలలుంటుంది. మదనపల్లె, ములకలచెరువు మార్కెట్‌లకు నిత్యం 1000 మెట్రిక్ టన్నుల నుంచి 2 వేల మెట్రిక్ టన్నుల టమోటా వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరలు ఇలాగే కొనసాగితే జిల్లాలోని టమోటా రైతులకు ఎంత లేదన్నా రూ.270 కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల్లో టమోటా సీజన్ నడుస్తోంది. వచ్చే నెలాఖరుకు అక్కడ సీజన్ ముగుస్తుంది. అంటే ఏప్రిల్, జూన్ నెలల్లో జిల్లాలో టమోటా ధరలు పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే పర్వాలేదు కానీ ప్రస్తుత పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం రంగంలోకి దిగాల్సిన అవసరం ఏర్పడుతుంది.

పెరగనున్న సాగు విస్తీర్ణం

జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో గత ఏడాది 15 వేల ఎకరాల వరకు టమోటా సాగైంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉంటుందని హార్టికల్చర్ అధికారులు చెబుతుండడంతో ఈ సీజన్‌లో కనీసం 16.5 వేల ఎకరాల్లో టమోటా సాగయ్యే అవకాశం ఉంది. అంటే రైతులు సరాసరిన రూ.495 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు అంచనా. ఇంత భారీ ఖర్చుతో సాగు చేసే టమోటా పంటపై ఆధారపడే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరంభ దశలోనే తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంది. రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా మార్కెటింగ్ శాఖ కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కనీసం రూ.15 ధర పలకాలి



కేజీ టమోటాకు 15 రూపాయలైనా వస్తే పెట్టుబడి తిరిగి వస్తుంది. ఇప్పటి ధరలతో సగానికి సగం మాత్రమే వస్తోంది. టమోటా వేసింది తక్కువే అయినా, ఈ రేట్లతో రైతులు చేతులు కాల్చుకుంటున్నారు. ప్రభుత్వం మదనపల్లె నుంచి టమోటా కొని, డిమాండ్ ఎక్కువగా ఉండే మార్కెట్లకు పంపితే గిట్టుబాటు ధర ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుంది.

- కృష్ణప్ప, టమోటా రైతు, మాలేపాడు, మదనపల్లె మండలం.

సింహవాహనంపై ఉగ్రనరసింహుడు

- వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



సింహవాహనంపై కొలువుదీరిన నరసింహుడు

గుర్రంకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారు కల్పవృక్ష, సింహ వాహనాలపై ఆశీనులై భక్తులను కనువిందు చేశారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి, ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారికి ఊంజలసేవను వేదపండితులు వైభవంగా చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన సింహవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి వాహనం ముందు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టార్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, నరసింహ, ధనుష్ ఆలయాధికారి కృష్ణమూర్తి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు. తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు ఉదయం తిరుచ్చి ఉత్సవంపై రాత్రి పెద్దశేష వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగనున్నారు.

చంద్రబాబుతోనే మహిళా సాధికారత సాధ్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి



స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, తదితరులు

రాయచోటిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమైందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి నగరంలోని నారాయణ ఫంక్షన్ హాలులో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతల వల్లే ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపుల వల్ల ఎంతోమంది మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించగలిగారన్నారు. అన్నమయ్య జిల్లాలో నాణ్యతతో కూడిన వస్తువులను విక్రయించేందుకు సహకరించిన కలెక్టర్, జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు.

కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతున్నామన్నారు. మదనపల్లికి చెందిన భవానీని స్ఫూర్తిగా తీసుకుని మహిళలందరూ ఆర్థిక, సామాజిక అభివృద్ధి పొందాలని సూచించారు. అన్నమయ్య జిల్లా జీడీపీలో 23వ ర్యాంకులో ఉన్నప్పటికీ అన్నమయ్య జిల్లాలోని మహిళలు డిజిటల్ కామర్స్‌లో ఎంతో ముందు ఉన్నారన్నారు. జిల్లాలోని మహిళలు చేసిన ఉత్పత్తులను విక్రయం చేసి రూ.25 లక్షల విలువతో 22 వేల లావాదేవీలు జరగడం ఇందుకు ఉదాహరణ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నేడు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న 635 స్వయం సహాయక సంఘాల మహిళలకు సుమారు రూ.90 కోట్ల రుణాలను అందిస్తున్నామన్నారు. అలాగే మిగిలిన పథకాల కింద కూడా వివిధ రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, ఐసీడీఎస్ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు వ్యక్తి మృతి!

- కరెంట్ తీగలు తగులుకుని రమేశ్‌నాయుడు మృతి


గుర్రంకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల వేట కోసం తీసిన కరెంట్ తీగలు తగులుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన దిగువకమ్మపల్లె వద్ద జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దిగువకమ్మపల్లెకు చెందిన రెడ్డెప్పనాయుడు కుమారుడు పి.రమేశ్ నాయుడు (48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో మల్లయ్యనాయుడు పొలం వైపు రమేశ్‌నాయుడు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే కిల్లారివాండ్లపల్లె, దిగువకమ్మపల్లె మధ్యలో ఉన్న వ్యవసాయ పొలాల్లో వేటగాళ్లు అడవి పందుల కోసం కరెంట్ తీగలను లాగినట్లు తెలిపారు. అది గమనించని అతడు అటు వైపు వెళ్లి కరెంట్ తీగలు తగులుకుని మృతి చెందినట్లు కుమారుడు తిరుమలనాయుడు చెబుతున్నాడు. తన తండ్రి అడవి పందుల కోసం తీసిన కరెంట్ తీగలు తగులుకుని చనిపోతే మృతదేహాన్ని వేటగాళ్లు తీసుకొచ్చి మల్లయ్యనాయుడు పొలంలోని వంకాయ పంటలో వేసినట్లు తెలుస్తోందని ఆరోపించారు. తన తండ్రి చావుకు కారణమైన వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



పొలంలో రమేశ్ నాయుడు మృతదేహం

మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- ర్యాలీలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలో ఎస్పీ, అదనపు ఎస్పీ

రాయచోటిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించడంతో పాటు ప్రతి విషయంలో వారికి తోడుగా నిలవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రజలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని శివాలయం కూడలి వద్దకు చేరుకుని అక్కడ మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల ప్రాముఖ్యత, వారు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. జిల్లాలో మహిళా సాధికారతకు కృషి చేస్తామని, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, సమాజానికి వెలుగునిస్తున్నారని చెప్పారు. మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ కృషి చేస్తారని తెలిపారు. మహిళలు చదువుకోవడానికి ప్రోత్సహించాలని, వారికి మంచి విద్యను అందిస్తే వారు తమ కాళ్లపై తాము నిలబడగలరన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజారమేశ్, రాయచోటి పట్టణ సీఐ చంద్రశేఖర్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రవిశంకర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, పట్టణ ఎస్‌ఐలు, మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే.. ఉత్తమ ఫలితాలు

- టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి
- టెన్త్ విద్యార్థులకు నిపుణుల సూచన



7

అరటి ధరలు ఢమాల్

- రైతన్నల ఆశలు ఆవిరి



7

మహిళలు లేకుంటే జీవితం దుర్భరం

- పారిశుధ్య కార్మికులకు సన్మానంలో ఎమ్మెల్యే



మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుంటుంబంలో, సంస్థల్లో, సమాజంలో మహిళలే లేకుంటే జీవితం దుర్భరంగా ఉంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నివాసం వద్ద మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మహిళలకు స్థానిక ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాయని గుర్తుచేశారు. మహిళలు రాష్ట్రపతి, రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా ఉన్నత రంగాల్లో ఉన్నారని గుర్తుచేశారు. అనంతరం మహిళా కార్మికులకు శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, జనసేన రీజినల్ కో-ఆర్డినేటర్ దారం అనిత, చంద్రశేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పాలవ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు మృతి
- బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జుగా మారిన వ్యాన్



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందుభాగం



వెంకటేశ్వర్లు (ఫైల్)

కలకడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పాలవ్యాన్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కేవీపల్లె ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప వివరాల మేరకు... మండల పరిధిలోని మహల్ క్రాస్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి పీలేరు నుంచి కలకడ వైపు వస్తున్న పాల వ్యాన్‌ను రాయచోటి నుంచి చెన్నై వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న రామాపురం మండలం నీలకంఠరావుపేటకు చెందిన డ్రైవర్ వెంకటేశ్వర్లు (24), చిత్తూరు జిల్లా గుడిపాల మండలానికి చెందిన ఢిల్లీ బాబు (33) అక్కడికక్కడే మృతి చెందిగా వ్యాన్ నుజ్జునుజ్జుగా మారింది. బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులెవరూ గాయపడలేదు. కాగా మృతుల్లో ఒకరైన వెంకటేశ్వర్లు తల్లి ముత్తమ్మ బతుకుదెరువు నిమిత్తం ఖత్తర్ దేశానికి వెళ్లినట్లు తెలిసింది. ఢిల్లీ బాబుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ అక్కులరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సెహరీ (సోమవారం ఉదయం)
రాయచోటి	6.29	5.07
మదనపల్లె	6.30	5.12
రాజంపేట	6.27	5.13
పీలేరు	6.28	5.05

రోడ్ల అభివృద్ధి, నాణ్యతలో రాజీ లేదు: మంత్రి

కడప కలెక్టరేట్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): రోడ్ల అభివృద్ధి, నాణ్యతలో రాజీకి తావులేదని అధికారులు చిత్తశుద్ధితో పనులు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా శనివారం కడప జిల్లాకు విచ్చేసిన ఆయనను అతిథి గృహంలో జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల అభివృద్ధి పనులు, గుంతల రహిత రోడ్ల మరమ్మతులపై ఆరా తీశారు. జిల్లా పరిధిలో గుంతల రహిత రోడ్ల కార్యక్రమంలో భాగంగా 219 పనులకు గాను రూ.35 కోట్లు కేటాయించగా 99 శాతం పనులు ఇప్పటికే పూర్తిచేశామని జిల్లా అధికారులు అన్నారు. అలాగే కడప బైపాస్‌కు మరో 14కి.మీ గుంతలు పూడ్చడానికి ఒప్పం దం పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఇర్కాన్ సర్కిల్ నుంచి ఊటుకూరు(ఆర్‌టీబీ) వరకు 6 కి.మీ గుంతలు పూడ్చే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు.

ప్రణాళికతోనే.. ఉత్తమ ఫలితాలు

పది పరీక్షల వేళ..

త్వరలో జరగనున్న (ఈనెల 17నుంచి 31వ తేదీవరకు) పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొంటున్నారు.





- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి
- టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని విద్యారంగ నిపుణుల సూచన



కడప ఎడ్యుకేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయులే కాదు.. తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల ఏకాగ్రతకు భంగం కలగకుండా ఉంటే చక్కగా రాణిస్తారని చెబుతున్నారు విద్యావేత్తలు. పాఠశాలల్లో ఈ మధ్య నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలోనూ ఇదే విషయంపై చర్చ జరిగింది. పరీక్షలవేళ తల్లిదండ్రుల భాగస్వామ్యం విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తుందని, ఇవి తప్పక పాటిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యం అని చెబుతున్నారు.

టీవీ, ఫోన్లకు దూరంగా ఉండాలి

పెద్దలను చూసే పిల్లలు ఏదైనా నేర్చుకుంటారు. పరీక్షలు దగ్గరపడుతు న్నాయి. మీరు చదువుకోండి అని చెప్పి పెద్దలు ఇంట్లో టీవీ చూస్తే పిల్లలు కూడా అక్కడకు చేరతారు. పరీక్షల పూర్తయ్యేంత వరకు టీవీలు, ఫోన్లకు తల్లిదండ్రులు దూరంగా ఉండాలి. ఇంట్లో ఫోన్లతో పాటు పదోతరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్ద ఇప్పటికే ట్యాబ్‌లు ఉన్నాయి. వీటిని, పూర్తిగా పరీక్షలయ్యేంత వరకు తల్లిదండ్రుల వద్దనే ఉంచుకోవాలి.

ప్రశాంత వాతావరణం కల్పిస్తే..

అవకాశం ఉన్నవాళ్లు విద్యార్థి చదువుకునేందుకు ఇంట్లో ప్రత్యేక గది (రీడింగ్ రూమ్) కేటాయించాలి. ఆ గదిలో గతంలో పిల్లలు సాధించిన విజయాలు వారికి గుర్తుకొచ్చేలా కనిపించేట్లుగా ఉంచాలి. వాటిని చూసి మరింత స్ఫూర్తి పొంది చదువుకునే వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు. చదువుకునే గదిలోకి ఎటువంటి శబ్దాలు, ఇతరులు రాకుండా చూసుకోవాలి. ఒకవేళ ప్రత్యేక గది లేనట్లయితే రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేసి విద్యార్థి చదువుకునేందుకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి.

ఆహారం ముఖ్యం

పరీక్షలు దగ్గర పడుతున్న ఈ సమయంలో విద్యార్థికి రాత్రిపూట తేలిక పాటి, త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వడం మేలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. విద్యార్థులకు శక్తినిచ్చే చిరుధాన్యాలు, పాలు, పండ్ల రసాలు వంటివి ఇస్తే వారు మరింత చురుగ్గా చదువుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఏం రాశారో ఆరా తీయాలి

విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి రాగానే పాఠశాలలో నిర్వహించిన రోజువారి పరీక్ష ఏ విధంగా రాశావు.. క్లాస్‌లో ఏం చెప్పారన్నది తెలుసుకోవాలి. ఏమైనా సందేహాలున్నాయా..? ఉపాధ్యాయులను అడిగావా? అంటూ ఆరా తీయాలి.

ప్రణాళికబద్ధంగా చదవాలి..



పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదవగలిగితే మంచి మార్కులు సాధించవచ్చు. పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు టీవీ, సెల్‌ఫోన్ అందుబాటులో లేకుండా చేయాలి. ఇది తల్లదండ్రుల ప్రధాన కర్తవ్యంగా భావించాలి. సమతుల్య ఆహారం తీసుకుంటూ శరీరం డీహైడ్రేషన్ కాకుండా నీళ్లు ఎక్కువగా తాగాలి. వీలైనంతగా ప్రశాంత వాతావరణంలో చదివేటట్లు చూడాలి.

- నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, కడప

అరటి ధరలు ఢమాల్

- రైతన్నల ఆశలు ఆవిరి



గెలలను కట్ చేసి బాక్సులలో నింపుతున్న కూలీలు

లింగాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. మండల వ్యాప్తంగా అరటిపంటను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. నెలరోజుల క్రితం అరటి ధరలు అమాంతంగా పెరిగి టన్ను రూ.28వేలకు చేరుకున్నాయి. దీంతో అరటి రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నెలరోజులు నిలకడగా ఉన్న ధరలు కొద్దిరోజులుగా ప్రతిరోజు తగ్గుతూ వస్తున్నాయి. గెలలతో అయితే నాణ్య మైన కాయలను గరిష్ఠంగా రూ.16వేలు, కనిష్టగా రూ.14వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కంపెనీ బాక్సులకు అయితే నాణ్యమైన కాయలను రూ.19వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

ధరలు పెరిగిన సమయంలో చాలా తక్కువ మంది రైతులకు సంబంధించిన పంట దిగుబడులు మాత్రమే వచ్చాయని, పంట దిగుబడులు ఇప్పుడిప్పుడే చేతికందుతున్న సమయంలో టన్నుకు పదివేల రూపాయలు ధర తగ్గిందని రైతులు వాపోతున్నారు. సీజన్ మొత్తం ధరలు నిలకడగా ఉంటేనే అంతో ఇంతో లాభాలు వచ్చేవని.. గత మూడు సంవత్సరాల నుంచి పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయని చెబుతున్నారు. ఎకరాకు సుమారు రూ.2లక్షలు పెట్టుబడి అవుతోందని, పంటకాలం 11 నుంచి 12నెలల పడుతుందన్నారు. పెట్టుబడులకు వడ్డీలు కలుపుకుంటే.. ఇప్పుడున్న ధరలతో ఏమి మిగలదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్రలోను దిగుబడులు రావడం ధరల పతనానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



గెలలతో ఉన్న అరటి పంట

కుక్క అడ్డు రావడంతో కారు అదుపు తప్పి బోల్తా

- బాలుడి మృతి.. నలుగురికి తీవ్రగాయాలు



రామాపురం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు 40వ జాతీయ రహదారిలో చిట్లూరు పంచాయతీ పాలన్నగారి పల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దర్శత్‌సాయి (1) అనే బాలుడు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గుర్రకొండ టౌన్‌కు చెందిన పాలకొండరాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కడపకు సమీపంలోని పాలకొండకు స్వామిని దర్శించు కునేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని పాలన్నగారిపల్లె వద్దకు రాగానే రోడ్డుపైన కుక్క అడ్డురావడంతో డ్రైవర్ కారును పక్కకు తిప్పడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో దర్శత్‌సాయి మృతి చెందగా.. డ్రైవర్ రాఖీ, నాగేశ్, మౌనిక, పూజిత గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఊటుకూరు వద్ద వృద్ధుడు మృతి

సీకేదిన్నె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు వద్ద కుక్క అడ్డు రావడంతో మోటారు సైకిల్‌లో వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు పోల్‌ను ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కడప నగరం నడింపల్లెకు చెందిన గంపా వెంకటసుబ్బయ్య (70) శనివారం ఉదయం కడప నుంచి రాయచోటివైపునకు జమాల్‌పల్లి పోయేందుకు మోటారు సైకిల్‌లో బయలుదేరాడు. ఊటుకూరు వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు పోల్‌ను ఢీకొనడంతో వెంకటసుబ్బయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గంపా చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

కారు ఢీకొనడంతో యువకుడి..

దువ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేళ్ల గ్రామం వద్ద శుక్రవారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో దూదేకుల బాష (26) అనే వ్యక్తి మృతిచెందాడు. దువ్వూరు వైపు నుంచి చాగలమర్రివైపు వెళుతున్న వ్యక్తిని కారుఢీకొనడంతో ఈ సంఘటన జరిగినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం లారీ

బద్వేలుటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా లారీలో తరలిస్తున్న 600 బస్తాల రేషన్‌బియ్యాన్ని సీఐ రాజగోపాల్ స్వాధీ నం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జమ్మలమడుగు నుంచి చెన్నైకి అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం తెల్లవారు జామున నాలుగురోడ్ల కూడలి వద్ద రేషన్ బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీలో 600 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని శాంపిల్స్‌తీసి ల్యాబ్‌కు పంపించామన్నారు.

సామాజిక బాధ్యత కలిగిన రచనలకే ఆదరణ

- జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ సభలో వక్తలు



కవి ఏసీ దస్తగిరిని సన్మానిస్తున్న శివచంద్రారెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత కలిగిన రచనలకే ప్రజల్లో ఆదరణ ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్‌కే గ్రాండ్ ఫంక్షన్ హాలులో కొనిరెడ్డి ఫౌండేషన్ సాహిత్య కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పురస్కారాలు 2025 ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వంద మంది కవులు, రచయితలు ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సభలో ప్రముఖ డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహించే ఇలాంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథి, పద్య కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ పురస్కారాలు స్వీకరించడం ద్వారా రచయితలు కవులపై మరింత బాధ్యత పెంచినట్లేనన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై కొరడా ఝుళిపించే కవుల కవితలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవన్నారు. నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు సాహిత్యాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు పుట్టపర్తి నారాయణాచార్యులు, వేమన, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు పూల మాలలు వేసి వారి ఆశయ సాధనలో పనిచేస్తామని ప్రతినబూనారు. కార్యక్రమంలో కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత డీకే చదువుల బాబు, తవ్వాఓబులరెడ్డి, ఈతకోట సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ నిందితులకు పరామర్శ



కడప సెంట్రల్‌జైలు వద్ద బీజేపీ నేతలు

కడప మారుతీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వీరభద్ర స్వామి ఊరేగింపులో ఇటీవల జరిగిన ఘర్షణలో అరెస్టు అయిన కడప సెంట్రల్ జైలు ఉన్న వారిని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబరు భాను ప్రకాశ్‌రెడ్డి, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టరు శశిభూషన్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కలిసి పరామర్శించారు. రాయచోటిలో వీరభద్రస్వామి ఉత్సవాలలో భాగంగా నాలుగు రోజుల క్రితం జరిగిన ఊరేగింపులో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. దీనికి సంబంధించి పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరికి కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో కడప సెంట్రల్‌జైలుకు తరలించారు. ఇక్కడున్న ఒక వర్గం వారిని బీజేపీ నేతలు శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ మహిళా ఉద్యోగులకు ఘన సత్కారం



ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళా ఉద్యోగులతో ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ఇటు కుటుంబ, అటు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న మహిళలు ఎంతో సహనశీలురని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి కొనియాడారు. శనివారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సమావేశానికి గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ఆర్టీసీ జోనల్, రీజనల్ స్థాయిలో వివిధ హోదాలలో ప్రతిభచాటిన మహిళా ఉద్యోగులను నగదు, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

ఉత్తమ మహిళా ఉద్యోగులు వీరే....

జోనల్ స్థాయిలో కె.లక్ష్మీదేవి (కుప్పం), దీప్తిసృజన (కర్నూలు-2), లలితమ్మ (కడప), మాధవి (తాడిపత్రి), విశ్వకళాదేవి (తాడిపత్రి), స్వాతి (మద నపల్లి-2)తో పాటు రీజనల్ స్థాయిలో ఈశ్వరమ్మ (పులివెందుల డిపో), రంగ మ్మ (ప్రొద్దుటూరు డిపో) లక్ష్మీదేవి (బద్వేల్ డిపో) నాగలక్ష్మి (మైదుకూరు) ప్రమీళ (కడప డిపో), ప్రియ (జమ్మలమడుగు డిపో) ఉన్నారు. కార్యక్ర మంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

టీటీఐ రజితకు అత్యుత్తమ రైల్వే బోర్డు పురస్కారం



రైల్వే బోర్డు చైర్మన్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న టీటీఐ రజిత

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఓం శాంతినగర్‌లో నివాసం ఉంటున్న రైల్వే టీటీఐ రజితకు రైల్వేశాఖ అత్యుత్తమ పురస్కారం దక్కింది. శనివారం న్యూఢిల్లీ నేషనల్ రైల్ మ్యూజియం ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని రజితకు అందించారు. 2024 డిసెంబరు 22న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఏసీ కపార్ట్‌మెంట్‌లో రూ.2లక్షలు విలువైన బంగారు చైన్ దొరకడంతో చిత్తూరు జీఆర్పీ సహాయంతో చైన్ పోగొట్టుకున్న ప్రయాణికులకు అందించారు. ఆమె సేవలను గుర్తించి పురస్కారంతో సత్కరించారు. కడపలో టీటీఐగా విధులు నిర్వహిస్తూ ఈ మధ్య కాలంలోనే ఆమె బదిలీపై తిరుపతి వెళ్లారు.

విడిపోయిన దంపతులను కలిపిన జడ్జి



భార్య భర్తలతో మాట్లాడుతున్న జడ్జి సత్యకుమారి

ప్రొద్దుటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న మనస్పర్ధలతో ఏడాది కాలం పాటు విడిపోయి జీవిస్తున్న దంపతులకు జిల్లా రెండో అదనపు జడ్జి సత్యకుమారి కౌన్సెలింగ్ ఇచ్చి కలిపిన అరుదైన ఘటన ప్రొద్దుటూరు లోక్ అదాలత్ కోర్టులో జరిగింది. వివరాల్లోకి వెళితే .. ప్రొద్దుటూరుకు చెందిన సాంబశివారెడ్డి అనే వ్యక్తి శుక్రవీణ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. వేర్వేరు కులాలకు చెందిన వీరు ప్రేమించి వివాహం చేసుకొని చిన్న చిన్న మనస్పర్ధలతో విడిపోయారు. ఏడాదికాలంగా వేరువేరుగా జీవిస్తున్నారు. భర్త దూరం కావడంతో శుక్రవీణ జాతీయ లోక్అదాలత్‌ను ఆశ్రయించారు. రెండో జిల్లా అదనపు కోర్టు జడ్జి సత్యకుమారి దంపతులిద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మీతో పాటు ఏడాది వయస్సు ఉన్న చిన్నారి ఉన్నాడని.. మీరు విడిపోవడం వల్ల ఆ పిల్లవాడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చిన్నారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని.. అన్యోన్యంగా జీవించాలని ఇరువురికి సూచించారు. న్యాయమూర్తి సూచనలతో సాంబశివారెడ్డి తన భార్య శుక్రవీణతో కలిసి జీవిస్తానని అంగీకరించారు. కార్యక్రమంలో సెషన్స్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాది బందెల ఓబులేసు, లోక్ అదాలత్ సభ్యుడు శ్రీనివాసులు, న్యాయవాదులు విజయలక్ష్మి, పద్మజ, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని పూజిత

మదనపల్లె అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెరువులో దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఉదయం మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో చోటు చేసుకుంది. మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. కలికిరి మండ లం మహల్ గ్రామానికి చెందిన ఎన్‌కే భాస్కర్ కుమార్తె పూజిత (21) మదనపల్లె సమీపంలోని కృష్ణ చైతన్య నర్సింగ్ కళాశాల్లో మూడో ఏడాది చదువుతూ.. ప్రశాంత్‌నగర్‌లోని బాలాజీ పీజీ హాస్టల్ ఉంటోంది. శుక్రవారం రాత్రి హాస్టల్ వార్డన్ వద్ద మహల్‌కు వెళుతున్నట్లు తెలిపి అనుమతి తీసుకుంది. కాగా, పూజిత చిన్నాయన వెంకటేష్ శుక్రవారం కలకడ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబసభ్యులు పూజితకు శుక్రవారం తెలిపారు. తమకు అన్నీ తానై చూసుకునే చిన్నాయన వెంకటేష్ అంత్యక్రియలకు బయలదేరిన పూజిత మనుస్థాపానికి గురై తట్టివారిపల్లె చెరువులో దూకి శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. పూజిత తండ్రి ఎన్‌కే భాస్కర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భర్త చనిపోయినా అందని పింఛన్



విజయమ్మ

రైల్వేకోడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భర్త చనిపోయినా తనకు పింఛన్ రాలేదని స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన బత్తల వెంకటస్వామి భార్య విజయమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. భర్త మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు అందజేశానన్నారు. ఈ విషయమై ఎంపీడీవో నాగార్జునరావు మాట్లాడుతూ ఈమేరకు తమకు ఆదేశాలు రాలేదన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం



తనిఖీ చేస్తున్న ఎస్ఐ

సుండుపల్లె, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాల్వ గ్రామ పంచాయతీ తూర్పు మాలపల్లి సమీపంలో సారా తయారీ కోసం నిల్వ ఉంచిన ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. సారా తయారీ కోసం ఊటను నిల్వ చేశారన్న సమాచారం రావడంతో పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించి సుమారు 150 లీటర్ల ఊట ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారీ కానీ, అమ్మకాలు కానీ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.పల్లెల్లో అమ్మకాలు చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెట్లు నరికివేత: పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ తూర్పు మాలపల్లి సమీపంలో రామయ్యకు చెందిన మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సుమారు పది మామిడి చెట్లను కింది నుంచి నరికి వేశారని రైతు రామయ్య ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం: ఏఐవైఎఫ్

రైల్వేకోడూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడొద్దని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ తెలిపారు. శనివారం సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు తమ మేనిఫెస్టోలో ప్రజలకు ఇస్తామని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా యూత్ ఫెడరషన్, అఖిల భారత యువజన సమ్మైక్య నాయకులు శెట్టిపల్లె పెంచలయ్య, విజయ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

రైల్వేకోడూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని హెచ్ఎంఎం హైస్కూలు కరస్పాండెంట్ కేఎం దేవసుందరం తెలిపారు. శనివారం విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు బాగా రాయాలన్నారు. హెచ్ఎం ప్రసాద్ మాట్లాడుతూ బాగా చదువుకుంటే ఉన్నతమైన స్థానాల్లో ఉంటారన్నారు.

మహిళలను గౌరవించినప్పుడే దేశం సుభిక్షం

రాజంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించినప్పుడే దేశం, కుటుంబం సుభిక్షంగా ఉంటాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. శనివారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్నిరంగాల్లో ముందుంటున్నారని, మహిళా శక్తిగా ఎదుగుతున్నారన్నారు. రాష్ట్ర సహాయ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, ప్రధానోపాధ్యాయురాలు భారతి, జయలక్ష్మీ, రీజనల్ కన్వీనర్ నరసింహ, మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





రాజంపేట: మహిళలను పూజిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్... రైల్వేకోడూరు: మాట్లాడుతున్న సీడీపీవో

మహిళలు అన్నిరంగాల్లో ముందున్నారు

రైల్వేకోడూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నారని రైల్వేకోడూరు ఐసీడీఎస్ సీడీపీవో టీపీ సౌభాగ్యమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు పాలెంకోట రత్నమ్మ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఏసీడీపీవో టి.సరళాదేవి, సూపర్‌వైజర్లు ఆటల పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు. అలాగే శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులను సత్కరించారు.

బెటాలియన్‌లో మెగా మెడికల్ క్యాంపు

సిద్దవటం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళా దినోత్సవం సందర్భంగా 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు కమాండెంట్ కె.ఆనందరెడ్డి తెలిపారు. వైద్యశిబిరంలో డాక్టర్ ఆర్.శిరీషా, డాక్టర్ జి.దివ్యరాణి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ హాజరై వైద్యసేవలను అందించారు. అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, డీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్‌లు కె.వెంకటరెడ్డి, బి.వెంకటశివుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళను గౌరవించాలి: ప్రతి మహిళను గౌరవించాలని డాక్టర్ ప్రకాష్ అన్నారు. సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు.

వృద్ధాశ్రమంలో మహిళా దినోత్సవం

రాయచోటిటౌన్, మార్చి8(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని తిరుపతినాయుడు కాలనీలో గల లక్ష్మీ వృద్ధాశ్రమంలో శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు దివిటి పద్మయాదవ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీసీ సంక్షేమ సంఘం మహిళా కార్యవర్గంతో కలిసి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి నిత్యవసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

రాజంపేట టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కోర్టు ఆవరణంలో కేక్‌లు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. సివిల్‌జడ్జి కేశవ, జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి, సెకండ్ క్లాసు మెజిస్ట్రేట్ శంకర్, ఏపీపీ రసూల్ రెహనా, పీపీ నిజాంజానీ, మహిళా న్యాయవాదులు సాయిప్రసాంతి, సులోచన, సరిత, ఆశా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: కొర్లకుంటలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు వీటీ చెంగల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పసుపు, కుంకుమలతో పాటు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, రైల్వేకోడూరు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి గోశాల దేవి, రాష్ట్ర నాయకులు శాంతయ్యల ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

నందలూరు: విద్యార్థులు ఉన్నతాశయాలతో ముందుకెళ్లాలని రిమ్స్ డాక్టర్ సృజన, గైనకాలజిస్టు కామేశ్వరమ్మలు పేర్కొన్నారు. గొబ్బిళ్ల అక్షర స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన లక్ష్మీచైతన్య, షేక్ జైనాబ్‌లను అభినందించారు. యాజమాన్యం గొబ్బిళ్ల త్రినాద్, గొబ్బిళ్ల శ్రీనాద్, ఉపాధ్యాయులు డాక్టర్ కామేశ్వరమ్మ, డాక్టర్ సృజనలను శాలువాత సత్కరించారు.



బెటాలియన్ కమాండెంట్ ఆనందరెడ్డి

ఉత్తమ మహిళా కండక్టర్లకు సన్మానం

రాయచోటిటౌన్, మార్చి8(ఆంధ్రజ్యోతి): రాయచోటి డిపోలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పరిధిలో ఏపీఎస్ఆర్టీసీలో ప్రయాణికులు ఉత్తమ సేవలు అందించిన మహిళా కండక్టర్లు కే. లక్ష్మీదేవి(మదనపల్లె డిపో-2), జీ. లక్ష్మీదేవి (మదనపల్లె డిపో), వీఎస్ జయంతి (పీలేరు డిపో) ఆర్. విజయ్ కుమారి (రాజంపేట డిపో), ఎస్. కమలమ్మ (రాయచోటి డిపో)లను ఆర్టీసీ జిల్లా రాయచోటి డిపో అధికారులు సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.







రాయచోటి: వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న పద్మాయాదవ్... రాజంపేట: న్యాయమూర్తులను సన్మానిస్తున్న దృశ్యం... రాయచోటి: కండక్టర్లను సన్మానిస్తున్న అధికారులు

క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి

నందలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పసుపులేటి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆడపూరులో వెలసిన మంచాలమ్మ జాతర సందర్భంగా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను శనివారం వారు ప్రారంభించారు. నాగిరెడ్డిపల్లె, పాటూరు గ్రామ టీడీపీ అధ్యక్షులు గంధం గంగాధర్, ముమ్మడిశెట్టి రమేష్, క్రికెట్ టోర్నమెంట్ కార్యనిర్వాహకులు రాజా, రిషి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

రైల్వేకోడూరు రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ టీడీపీ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖాది, గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ కే.కే చౌదరి తెలిపారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభితో కలిసి ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 240 కేసులు పరిష్కారం

రాయచోటిటౌన్, మార్చి8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి జిల్లా ఐదవ అదనపు కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 240 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా రాయచోటి కోర్టు పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాద కేసులతో పాటు భార్యభర్తల సమస్యలు నగదు సమస్యలు తదతర కేసుల్లో ఐదు వర్గాల కక్ష దారులను విచారించిన జిల్లా ఐదవ వర్గాల కక్ష్య దారులను విచారించిన జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియన్ సివిల్ జడ్జి ప్రసూన రాజీమార్గం ద్వారా 240 కేసులను పరిష్కరించి ఆ కేసులకు గాను ఒక కోటి 86 లక్షల 46 వేల 95 రూపాయలను చెల్లింపులను చేపట్టారు.

80 కేసులకు శాశ్వత పరిష్కారం

నందలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నందలూరు జూనియర్ సివిల్‌కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్ నందు జడ్జి భార్గవి 80 కేసులకు శాశ్వత పరిష్కారం చూపించారు. ఇందులో ఆరు సివిల్ తగాదాలు, నాలుగు పీఎల్‌సీలు, 70 క్రిమినల్ కేసులు ఉన్నా యి. కోర్టు సూపరింటెండెంట్ రమేష్, న్యా యవాదులు దాసరి నరసింహులు, సుబ్బరామయ్య, నూర్, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు, నగదు స్వాధీనం

సుండుపల్లె, మార్చి8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న రెంటు ట్రాక్టర్లు, ఒక జేసీబీ శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తె లిపారు. ఈ మేరకు మూడు వాహనాల కు రూ.15 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ దైవాధీనం తెలిపారు. పెద్దమాదిగపల్లె గ్రామస్తులు మట్టి తరలింపును శుక్రవారం రాత్రి అడ్డుకొని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో పట్టుకున్నట్లు తెలిపారు. అధికారుల అనుమతులు లేకుండా మట్టి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డబుల్ రోడ్డు పూర్తి చేయాలి



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

సుండుపల్లె, మార్చి8(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె- రాయచోటి అర్థాంతరంగా ఆగిన డబుల్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. త్వరగా రోడ్డు పనులు పూర్తి చేస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునని కోరారు. టీడీపీ నాయకులు శివరాం నాయుడు, మోహన్‌బాబునాయుడు, సోమిశెట్టి మస్తాన్, సురేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచవేద మహాభారతం ప్రారంభం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కోనంపేటలో శనివారం నుంచి ఈనెల 20 వరకు పంచవేద మహాభారతాన్ని గ్రామస్థులు, ధన్వి నారాయణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్‌సైన్ సౌజన్యంతో ప్రారంభించారు. మదనపల్లె మహేశ్వర కళానాట్యమండలి వారిచే శనివారం హైమావతి భాగవతారిణిచే హరికథ కాలక్షేపం, వ్యాసమహర్షి జననం గురించి, మహాభారంతో ద్రౌపతి కల్యాణం గురించి వివరించారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి : సీఐ




వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ బాబు

సిద్దవటం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారి బాకరాపేట చెక్‌పోస్టు సమీపాన శనివారం సాయంత్రం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు వాహనాలు తనిఖీ చేశారు. మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి బాకరాపేట చెక్‌పోస్టు సమీపాన శనివారం సాయంత్రం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టి వాహనదారులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని, నేషనల్ హైవేపై ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనదారులు ప్రతిఒక్కరు లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, దానివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని, అతివేగం ప్రమాదకరమని, ఆయన వాహనదారులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యల్లమ్మ తల్లికి అభిషేకం

సుండుపల్లె, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లిలో, ఎల్లారెడ్డిగారిపల్లె సమీపాన వెలసిన శ్రీయల్లమ్మ తల్లి రెండు ఆలయాల్లో శనివారం అభిషేకం, హోమం, పూజలు కార్యాక్రమాలను భక్తులు నిర్వహించారు. ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా అమ్మవారి తిరుణాల నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, తోట రవీంద్ర, పురం భాస్కర్, రెడ్డెంపల్లి రామాంజులు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధునాతన హోమియో చికిత్సతో సంతాన లేమికి చెక్



● డాక్టర్ ఎస్.ప్రభాకర్, హోమియో వైద్యుడు, రాజంపేట

రాజంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సంతానం లేని మహిళలకు హోమియో వైద్యం ఎంతో ఉపకరిస్తుందని రాజం పేట ప్రభుత్వ హోమియో పతి వైద్యుడు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. హోమియో మం దులు క్రమం తప్పకుండా వాడితే మూడు నెలల్లోనే ఫలితం లభిస్తుందన్నారు. హోమియో మందులు వాడినవారికి కచ్చితంగా సంతానం కలుగుతుందని తెలిపారు. ఆ వివరాలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: హోమియో మందుల ద్వారా సత్వరం పరిష్కారమయ్యే వ్యాధులేవి?

జవాబు: హోమియో వైద్యం సర్వరోగ నివారణి. హోమియో వైద్యం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. కాదంటే హోమియో వైద్యం ఫలితాలు కొంత సమయాన్ని ఇస్తాయి. అయితే మంచి ఫలితాలు ఇస్తాయి. హోమియో వైద్యం గత కరోనా సమయంలో కూడా బాగా ఉపయోగపడింది. థైరాయిడ్, జీర్ణకోశ వ్యాధులు, కిడ్నీల్లో రాళ్లు, పైల్స్ ఫిషర్, పిస్టులా లాంటి వ్యాధులు కూడా నయమవుతాయి.

ప్రశ్న:మానసిక ఆందోళనపై హోమియో వైద్య ప్రభావమేమి?

జవాబు: మానసిక ఆందోళన, ఒత్తిడిని నిర్మూలించి మనశ్శాంతిని చేకూర్చే దివ్య ఔషధం హోమియో వైద్యం. తలనొప్పి, మైగ్రేన్ వ్యాధులను కూడా నయం చేస్తాం.కాలేయానికి సంబంధించి వ్యాధులకు కూడా చికిత్స ఉంటుంది.

ప్రశ్న: చర్మ వ్యాధిగ్రస్థులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి;?

జవాబు: ప్రస్తుత వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయి. ప్రధానంగా తెల్లమచ్చలు, సోరియాసిస్, పులిపిర్లు వస్తాయి. వీటికి విశిష్టమైన హోమియో వైద్యంతో చర్మ వ్యాధులను రాకుండా చేయవచ్చు.

ప్రశ్న: హోమియో ప్రత్యేకత ఏమిటి?

జవాబు: హోమియో వైద్యం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఇంజక్షన్ లేకుండా కేవలం మాత్రలతోనే అన్నివ్యాధులను నయం చేయబడుతుంది. కీళ్లనొప్పులు, చికెన్‌గన్యా, వెన్నుముక నొప్పులు, థైరాయిడ్ వ్యాదులు ఇలా అన్నిరకాల వ్యాధులను నయం చేయబడుతుంది.

'భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి'

ఓబులవారిపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : 'భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు పృథ్విరాజ్ తెలిపిన వివరాల మేరకు బొమ్మవరం గ్రామంలో రెవెన్యూ సర్వేనంబరు 937, 938, 939లలో 10 ఎకరాల భూమిని సుబ్బరాఘవరాజు నుంచి 2010ఆగస్టు నెలలో కొనుగోలు చేసి చిట్వేలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నానన్నారు. సుబ్బరాఘవరాజు మరణించిన తర్వాత ఆయన భార్య, మరికొందరు తాను కొనుగోలు చేసిన భూమిలో మరొక భాగం ఉందంటూ రైల్వేకోడూరు కోర్టులో కేసు వేశారన్నారు. రెండు రోజుల క్రితం తన పొలంలో ఉన్న మామిడిచెట్లను నరికివేశారని, న్యాయం చేయాలని కోరారు.

నేడు జూనియర్ జూడో ఎంపికలు

పెనగలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్‌జీసస్ పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి జూనియర్ జూడో పోటీలు జరగనున్నట్లు జిల్లా జూడో కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2005 నుంచి 2010లో జన్మించినవారే ఉండాలన్నారు. ఎంపికలకు వచ్చేవారు తన ఒరిజనల్ పుట్టిన తేదీ సర్టిఫికెట్ చూపించాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైనవారు ఈనెల 15, 16 తేదీల్లో విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, ఎంట్రీ ఫీజు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9848267126కు సంప్రదించాలని ఆయన కోరారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

రాజంపేట టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):రాజంపేట పట్టణంలోని కృష్ణానగర్ వద్ద శనివారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో స్థానిక బలిజపల్లెకు చెందిన మధు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. రెండు బైకులు అతివేగంతో ఎదురెదురుగా వస్తూ అదుపుతప్పి ఢీకొన్నాయి. మధును స్థానిక ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కోడ్‌క్రాఫ్ట్ హాకథాన్ జాతీయ స్థాయిలో 'అన్నమాచార్య' ప్రతిభ

రాజంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అండ్ సైన్స్(ఏఐటీఎస్) ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో కోడ్‌క్రాఫ్ట్ హాకథాన్‌లో పాల్గొని హ్యాండ్‌రైటింగ్, రికగ్నిషన్ సిస్టమ్ అనే ప్రాజెక్టులు రూపొందించి ప్రతిభను చాటారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) పద్ధతులను ఉపయోగించి ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయడం ద్వారా ఆటోమెటెడ్ హ్యాండ్‌రైటింగ్ గుర్తింపు వ్యవస్థను రూపొందించారు. కోడ్ క్రాఫ్ట్ హాకథాన్ 48 గంటల నిరంతర ఆన్‌లైన్ పోటీగా నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విద్యా సంస్థల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కోడేట్రూా సంస్థ ఈ హాకథాన్‌ను సాఫ్ట్‌వేర్ అభివృద్ధి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన యువ ప్రతిభావంతులను గుర్తించేందుకు నిర్వహించింది. ఈ సంస్థకు టాంపా(ఫ్లోరిడా), చికాగో(ఇలినాయిస్), హైదరాబాదు(తెలంగాణ) నగరాల్లో కార్యాలయాలు ఉన్నాయి. కోడేట్రూా ఉత్తమ టెక్నికల్ నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి పరిశ్రమ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. హాకథాన్‌లో ప్రథమ స్థానం సాందించిన రాజంపేటకు చెందిన చిట్టివు కన్ననన్‌రెడ్డి, మానే ఆనందగోపాల్‌రెడ్డి, యనమల అఖిల్‌కుమార్‌రెడ్డి, గుబగుండం మహేంద్ర, మేక మనోజ్‌లు ప్రతిభ కనబరచడంతో కోడెట్రూా సంస్థ లక్ష రూపాయలు నగదు బహుమతి అందజేసింది. అంతేగాక వీరికి సంస్థ నుంచి ఉద్యోగ అవకాశాలు కూడా ప్రకటించింది. ప్రతిభ కనబరచిన విద్యార్థులను అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ సాయిబాబారెడ్డి, ప్రోఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్. మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.సుబ్బారావులు అభినందించారు.



ప్రతిభ కనబరచిన ఇంజనీరింగ్ విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల బృందం

పది పరీక్షల వేళ..

ప్రణాళికతోనే.. ఉత్తమ ఫలితాలు

త్వరలో జరగనున్న (ఈనెల 17నుంచి 31వ తేదీవరకు) పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొంటున్నారు.





- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి
- టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని విద్యారంగ నిపుణుల సూచన

కడప ఎడ్యుకేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయులే కాదు.. తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల ఏకాగ్రతకు భంగం కలగకుండా ఉంటే చక్కగా రాణిస్తారని చెబుతున్నారు విద్యావేత్తలు. పాఠశాలల్లో ఈ మధ్య నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలోనూ ఇదే విషయంపై చర్చ జరిగింది. పరీక్షలవేళ తల్లిదండ్రుల భాగస్వామ్యం విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తుందని, ఇవి తప్పక పాటిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యం అని చెబుతున్నారు.

టీవీ, ఫోన్లకు దూరంగా ఉండాలి

పెద్దలను చూసే పిల్లలు ఏదైనా నేర్చుకుంటారు. పరీక్షలు దగ్గరపడుతు న్నాయి. మీరు చదువుకోండి అని చెప్పి పెద్దలు ఇంట్లో టీవీ చూస్తే పిల్లలు కూడా అక్కడకు చేరతారు. పరీక్షల పూర్తయ్యేంత వరకు టీవీలు, ఫోన్లకు తల్లిదండ్రులు దూరంగా ఉండాలి. ఇంట్లో ఫోన్లతో పాటు పదోతరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్ద ఇప్పటికే ట్యాబ్‌లు ఉన్నాయి. వీటిని, పూర్తిగా పరీక్షలయ్యేంత వరకు తల్లిదండ్రుల వద్దనే ఉంచుకోవాలి.

ప్రశాంత వాతావరణం కల్పిస్తే..

అవకాశం ఉన్నవాళ్లు విద్యార్థి చదువుకునేందుకు ఇంట్లో ప్రత్యేక గది (రీడింగ్ రూమ్) కేటాయించాలి. ఆ గదిలో గతంలో పిల్లలు సాధించిన విజయాలు వారికి గుర్తుకొచ్చేలా కనిపించేట్లుగా ఉంచాలి. వాటిని చూసి మరింత స్ఫూర్తి పొంది చదువుకునే వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు. చదువుకునే గదిలోకి ఎటువంటి శబ్దాలు, ఇతరులు రాకుండా చూసుకోవాలి. ఒకవేళ ప్రత్యేక గది లేనట్లయితే రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేసి విద్యార్థి చదువుకునేందుకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి.

ఆహారం ముఖ్యం

పరీక్షలు దగ్గర పడుతున్న ఈ సమయంలో విద్యార్థికి రాత్రిపూట తేలిక పాటి, త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వడం మేలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. విద్యార్థులకు శక్తినిచ్చే చిరుధాన్యాలు, పాలు, పండ్ల రసాలు వంటివి ఇస్తే వారు మరింత చురుగ్గా చదువుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఏం రాశారో ఆరా తీయాలి

విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి రాగానే పాఠశాలలో నిర్వహించిన రోజువారి పరీక్ష ఏ విధంగా రాశావు.. క్లాస్‌లో ఏం చెప్పారన్నది తెలుసుకోవాలి. ఏమైనా సందేహాలున్నాయా..? ఉపాధ్యాయులను అడిగావా? అంటూ ఆరా తీయాలి.



ప్రణాళికబద్ధంగా చదవాలి..



పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదవగలిగితే మంచి మార్కులు సాధించవచ్చు. పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు టీవీ, సెల్‌ఫోన్ అందుబాటులో లేకుండా చేయాలి. ఇది తల్లదండ్రుల ప్రధాన కర్తవ్యంగా భావించాలి. సమతుల్య ఆహారం తీసుకుంటూ శరీరం డీహైడ్రేషన్ కాకుండా నీళ్లు ఎక్కువగా తాగాలి. వీలైనంతగా ప్రశాంత వాతావరణంలో చదివేటట్లు చూడాలి.

- నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, కడప

అరటి ధరలు ఢమాల్

- రైతన్నల ఆశలు ఆవిరి



గెలలను కట్ చేసి బాక్సులలో నింపుతున్న కూలీలు

లింగాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. మండల వ్యాప్తంగా అరటిపంటను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. నెలరోజుల క్రితం అరటి ధరలు అమాంతంగా పెరిగి టన్ను రూ.28వేలకు చేరుకున్నాయి. దీంతో అరటి రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నెలరోజులు నిలకడగా ఉన్న ధరలు కొద్దిరోజులుగా ప్రతిరోజు తగ్గుతూ వస్తున్నాయి. గెలలతో అయితే నాణ్యమైన కాయలను గరిష్ఠంగా రూ.16వేలు, కనిష్ఠగా రూ.14వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కంపెనీ బాక్సులకు అయితే నాణ్యమైన కాయలను రూ.19వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

ధరలు పెరిగిన సమయంలో చాలా తక్కువ మంది రైతులకు సంబంధించిన పంట దిగుబడులు మాత్రమే వచ్చాయని, పంట దిగుబడులు ఇప్పుడిప్పుడే చేతికందుతున్న సమయంలో టన్నుకు పదివేల రూపాయలు ధర తగ్గిందని రైతులు వాపోతున్నారు. సీజన్ మొత్తం ధరలు నిలకడగా ఉంటేనే అంతో ఇంతో లాభాలు వచ్చేవని.. గత మూడు సంవత్సరాల నుంచి పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయని చెబుతున్నారు. ఎకరాకు సుమారు రూ.2లక్షలు పెట్టుబడి అవుతోందని, పంటకాలం 11 నుంచి 12నెలల పడుతుందన్నారు. పెట్టుబడులకు వడ్డీలు కలుపుకుంటే.. ఇప్పుడున్న ధరలతో ఏమి మిగలదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్రలోను దిగుబడులు రావడం ధరల పతనానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



గెలలతో ఉన్న అరటి పంట

కుక్క అడ్డు రావడంతో కారు అదుపు తప్పి బోల్తా

- బాలుడి మృతి.. నలుగురికి తీవ్రగాయాలు



రామాపురం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు 40వ జాతీయ రహదారిలో చిట్లూరు పంచాయతీ పాలన్నగారి పల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దర్శత్‌సాయి (1) అనే బాలుడు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గుర్రకొండ టౌన్‌కు చెందిన పాలకొండ రాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కడ పకు సమీపంలోని పాలకొండకు స్వామిని దర్శించు కునేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని పాలన్నగారిపల్లె వద్దకు రాగానే రోడ్డుపైన కుక్క అడ్డురావడంతో డ్రైవర్ కారును పక్కకు తిప్పడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో దర్శత్‌సాయి మృతి చెందగా.. డ్రైవర్ రాఖీ, నాగేశ్, మౌనిక, పూజిత గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఊటుకూరు వద్ద వృద్ధుడు మృతి

సీకేదిన్నె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు వద్ద కుక్క అడ్డు రావడంతో మోటారు సైకిల్‌లో వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు పోల్‌ను ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కడప నగరం నడింపల్లెకు చెందిన గంపా వెంకటసుబ్బయ్య (70) శనివారం ఉదయం కడప నుంచి రాయచోటివైపునకు జమాల్‌పల్లి పోయేందుకు మోటారు సైకిల్‌లో బయలుదేరాడు. ఊటుకూరు వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు పోల్‌ను ఢీకొనడంతో వెంకటసుబ్బయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గంపా చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

కారు ఢీకొనడంతో యువకుడి..

దువ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేళ్ల గ్రామం వద్ద శుక్రవారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో దూదేకుల బాష (26) అనే వ్యక్తి మృతిచెందాడు. దువ్వూరు వైపు నుంచి చాగలమర్రివైపు వెళుతున్న వ్యక్తిని కారుఢీకొనడంతో ఈ సంఘటన జరిగినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం లారీ

బద్వేలుటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా లారీలో తరలిస్తున్న 600 బస్తాల రేషన్‌బియ్యాన్ని సీఐ రాజగోపాల్ స్వాధీ నం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జమ్మలమడుగు నుంచి చెన్నైకి అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం తెల్లవారు జామున నాలుగురోడ్ల కూడలి వద్ద రేషన్ బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీలో 600 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని శాంపిల్‌తీసి ల్యాబ్‌కు పంపించామన్నారు.

సామాజిక బాధ్యత కలిగిన రచనలకే ఆదరణ

- జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ సభలో వక్తలు

ప్రొద్దుటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత కలిగిన రచనలకే ప్రజ ల్లో ఆదరణ ఉంటుందని వక్తలు పేర్కొన్నా రు. శనివారం స్థానిక ఎస్‌కే గ్రాండ్ ఫంక్షన్ హాలులో కొనిరెడ్డి ఫౌం డేషన్ సాహిత్య కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సాహి త్య పురస్కారాలు 2025 ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వంద మంది కవులు, రచయి తలు ఈ సత్కారాన్ని అందుకున్నా రు. ఈ సభలో ప్రముఖ డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహించే ఇలాంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథి, పద్య కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ పురస్కారాలు స్వీకరించడం ద్వారా రచయితలు కవులపై మరింత బాధ్యత పెంచినట్లేనన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై కొరడా ఝళిపించే కవు ల కవితలు ఎంతో స్ఫూర్తిదాయ కమైనవన్నారు. నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయ కులు సాహిత్యాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, హర్షవర్షన్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకా డమీ గ్రహీత డీకే చదువుల బాబు, తవ్వాటబులరెడ్డి, ఈతకోట సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

టీటీఐ రజితకు అత్యుత్తమ రైల్వే బోర్డు పురస్కారం



రైల్వే బోర్డు చైర్మన్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకుంటున్నరజిత

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఓం శాంతినగర్‌లో నివాసం ఉంటున్న రైల్వే టీటీఐ రజితకు రైల్వేశాఖ అత్యుత్తమ పురస్కారం దక్కింది. శని వారం న్యూఢిల్లీ నేషనల్ రైల్ మ్యూజియం ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరిం చుకొని రైల్వేబోర్డు చైర్మన్ సతీష్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని రజితకు అందించారు. 2024 డిసెం బరు 22న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఏసీ కపార్ట్‌మెంట్‌లో రూ.2లక్షలు విలు వైన బంగారు చైన్ దొరకడంతో చిత్తూరు జీఆర్పీ సహాయంతో చైన్ పోగొట్టుకున్న ప్రయా ణికులకు అందించారు. ఆమె సేవలను గుర్తించి పురస్కారంతో సత్కరించారు. కడపలో టీటీఐగా విధులు నిర్వహిస్తూ ఈ మధ్య కాలంలోనే ఆమె బదిలీపై తిరుపతి వెళ్లారు.

ఆర్టీసీ ఉత్తమ మహిళా ఉద్యోగులకు ఘన సత్కారం



ఉత్తమ మహిళా ఉద్యోగులతో ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ఇటు కుటుంబ, అటు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న మహిళలు ఎంతో సహనశీలురని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్ రెడ్డి కొనియాడారు. శనివారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సమావేశానికి గోపాల్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ఆర్టీసీ జోనల్, రీజనల్ స్థాయిలో వివిధ హోదాలలో ప్రతిభచాటిన మహిళా ఉద్యోగులను నగదు, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

ఉత్తమ మహిళా ఉద్యోగులు వీరే.... : జోనల్ స్థాయిలో కె.లక్ష్మీదేవి (కుప్పం), దీప్తిసృజన (కర్నూలు-2), లలితమ్మ (కడప), మాధవి (తాడిపత్రి), విశ్వకళాదేవి (తాడిపత్రి), స్వాతి (మదనపల్లి-2)తో పాటు రీజనల్ స్థాయిలో ఈశ్వరమ్మ (పులివెందుల డిపో), రంగమ్మ (ప్రొద్దుటూరు డిపో) లక్ష్మీదేవి (బద్వేల్ డిపో) నాగలక్ష్మి (మైదుకూరు) ప్రమీళ (కడప డిపో), ప్రియ (జమ్మలమడుగు డిపో) ఉన్నారు. కార్యక్ర మంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘర్షణ నిందితులకు పరామర్శ



కడప సెంట్రల్‌జైలు వద్ద బీజేపీ నేతలు

కడప మారుతీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వీరభద్ర స్వామి ఊరేగింపులో ఇటీవల జరిగిన ఘర్షణలో అరెస్టు అయిన కడప సెంట్రల్ జైలు ఉన్న వారిని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బిట్ర శివ నారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబరు భాను ప్రకాశ్‌రెడ్డి, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టరు శశి భూష న్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ కలిసి పరామర్శించారు. రాయచోటిలో వీర భద్ర స్వామి ఉత్సవాలలో భాగంగా నాలుగు రోజుల క్రితం జరిగిన ఊరేగింపులో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. దీనికి సంబంధించి పలువురిపై పోలీ సులు కేసు నమోదు చేశారు. వీరికి కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో కడప సెంట్రల్‌జైలుకు తరలించారు. ఇక్కడున్న ఒక వర్గం వారిని బీజేపీ నేతలు శనివారం పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని పూజిత

మదనపల్లె అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఉదయం మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో చోటు చేసుకుంది. మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. కలికిరి మండ లం మహల్ గ్రామానికి చెందిన ఎన్‌కే భాస్కర్ కుమార్తె పూజిత (21) మదనపల్లె సమీపంలోని కృష్ణ చైతన్య నర్సింగ్ కళాశాల్లో మూడో ఏడాది చదువుతూ.. ప్రశాంత్‌నగర్‌లోని బాలాజీ పీజీ హాస్టల్ ఉంటోంది. శుక్రవారం రాత్రి హాస్టల్ వార్డన్ వద్ద మహల్‌కు వెళుతున్నట్లు తెలిపి అనుమతి తీసుకుంది. కాగా, పూజిత చిన్నాయన వెంకటేష్ శుక్రవారం కలకడ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబసభ్యులు పూజితకు శుక్రవారం తెలిపారు. తమకు అన్నీ తానై చూసుకునే చిన్నాయన వెంకటేష్ అంత్యక్రియలకు బయలదేరిన పూజిత మనుస్థాపానికి గురై తట్టివారిపల్లె చెరువులో దూకి శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. పూజిత తండ్రి ఎన్‌కే భాస్కర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మహిళ లేనిదే సృష్టి లేదు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళలకు ఘనంగా సన్మానం

సృష్టికి మూలం మహిళ అన్న విషయాన్ని గుర్తెరిగి స్త్రీ జాతిని గౌరవించాలని, పురుషులతో సమానంగా వారికీ అవకాశాలు ఇచ్చేలా ప్రభుత్వాలు కృషి చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో పలువురు మహిళా అధికారులను ఘనంగా సత్కరించారు. మహిళా సాధికారిత సాధిస్తే రాష్ట్రాలు సహా దేశ భవిష్యత్తు ఉన్నత శిఖరాలను అందుకుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంరక్షణ కోసం చేసిన చట్టాలు మహిళలకు పరిపూర్ణంగా తెలియపరచి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. మదనపల్లెలో ఎమ్మెల్యే షాజహాన్ బాష తన నివాసం వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ప్రతి మహిళ మానసిక వత్తిడికి గురికాకూడదని, మానసిక ప్రశాంతత అవసరమని డాక్టర్ రాధిక మహిళలకు విజ్ఞప్తి చేశారు.





సంప్రదాయ వేషధారణలో ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు - 'షీ' సంస్థ కార్యాలయంలో మహిళా దినోత్సవం

మదనపల్లె అర్బన్/బి.కొత్తకోట/నిమ్మనపల్లె/తంబళ్లపల్లె/పీలేరు/వాల్మీకిపురం/కలకడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పలు కార్యాలయాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకగా నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. వికలాంగ మహిళలకు అన్నమయ్యజిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వికలాంగులకు ఇళ్ల పట్టాల ధ్రువీకరణ పత్రాలను కమిటీ సభ్యుడు ఎమ్మెల్యే షాజహాన్ బాష అందించారు. నియోకవర్గ అధ్యక్షుడు వెంకటరమణానాయుడు, టౌన్ అధ్యక్షుడు రెడ్డిబాబు, రూరల్ అధ్యక్షుడు నరసింహులు, రెడ్డెమ్మ, సుజాత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రతి మహిళకు మానసిక ప్రశాంతత అవసరమని డాక్టర్ రాధిక మహిళలకు విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులు ఎస్ఐ శివకామిని, లాయర్ రమాదేవి పాల్గొన్నారు. డేనియల్ ఇండియా కంపెనీ జీఎం సోలోమెన్ మురారి, మేనేజరు స్వర్ణ, బహుజన సేన నాయకురాళ్లు మేరీ, లక్ష్మీ, రాటకొండ ఉషారాణి, మనోహర్‌రెడ్డి, రూపేనాయక్, శివశంకర, హరి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం చేసుకున్నారు. కస్తూర్బా విద్యాలయం, ఆదిత్య కళాశాలలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్పెషలాఫీసర్ విశ్వలత, ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడారు. బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి, ఏఓ రమాదేవిని బీజేపీ నేతలు సత్కరించారు. కావడి రవీంద్ర, ముకుంద, మురళి, రాజేంద్రనాయక్, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లి మండలం ఎగువమాచిరెడ్డిగారి పల్లె కార్యక్రమంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో వుండాలని మహిళా ఏపీ వ్యవసాయవృత్తుల కార్యదర్శి శోభ పేర్కొన్నారు. యూనియన్ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. తంబళ్లపల్లె కేజీబీవీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సుమతి మాట్లాడుతూ చదువుతోనే మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తారని అన్నారు. పీలేరు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, పోలీసు స్టేషన్, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. 'మానవత', 'షీ' స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పట్టణంలో వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సన్మానించారు. ఎంజేఆర్ కళాశాల చైర్మన్ ఎం.పి.అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదుర్కోనాలన్నారు. స్త్రీ సమానత్వం, సాధికారతే సమాజ ప్రగతికి మూలమన్నారు. వేడుకల్లో విద్యార్థినులందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఎంజేఆర్ కళాశాల చైర్మన్ ఎం.పి.అవినాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ కేవీ ఎస్ఎన్ రావు, ఎంఈఓలు లోకేశ్వరరెడ్డి, పద్మావతమ్మ, 'షీ' సంస్థ అధ్యక్షురాలు పీవీఎస్ లక్ష్మి, మానవత సంస్థ సభ్యులు రామచంద్ర, రాచపల్లె కృష్ణమూర్తి, శెట్టిసుబ్రహ్మణ్యం, రహత్ బాషా తదితరులు పాల్గొన్నారు. వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా చేసుకున్నారు. సెమినార్ హాల్‌లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు మహిళా సాధికారత, లింగ సమానత్వం ప్రాముఖ్యతను వివరించారు. ఏఎస్ఐ లీలావతి మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దప్పరాజు, అధ్యాపకులు విజయలక్ష్మి, రేణుక, కృపామయి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కలకడ పోలీసు స్టేషన్ మహిళా కానిస్టేబుల్ శోభారాణిని ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది సన్మానించారు.









నగర పంచాయతీ కమిషనర్ జీవీపల్లవిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు - పీలేరులో ఆటో డ్రైవర్ రేష్మను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు - వాల్మీకిపురంలో ఏఎస్ఐ లీలావతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు - మదనపల్లెలో ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ

నాటుసారా నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలి

ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

వాల్మీకిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనే ధ్యేయంగా ప్రతి అధికారీ పనిచేయాలని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో చేపట్టిన ఆకస్మిక తనిఖీలో రికార్డులు పరిశీలించి, సిబ్బంది విధులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0ను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా నాటుసారా తయారీ, విక్రయాల ప్రాంతాల్లో కౌన్సెలింగ్ చేపట్టి వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధిపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జహీర్, స్థానిక సీఐ లత, ఎస్ఐ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు బాసటగా కూటమి ప్రభుత్వం

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన : ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



నిరుద్యోగులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కళాశాల యజమాన్యం

మదనపల్లె టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, శ్రీనివాస డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర మానవ వనరుల, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులు ప్రవేశపెట్టి డిగ్రీ విద్యార్థులకు మెరుగైన రీతిలో తీర్చిదిద్దుతున్నారన్నారు. మెగా జాబ్‌మేళాలు నిర్వహించి టెన్త్ నుంచి పీజీ చదివిన నిరుద్యోగులకు 25 ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి డి.నాగార్జున, కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాకు 890 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోగా ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపిన 545 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి సహకరించండి

- ఇన్‌చార్జి మంత్రిని కలిసిన జయచంద్రారెడ్డి



మంత్రిని కలిసిన జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కోరారు. రాయచోటిలో శనివారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రిని తం బళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విశ్రాంతి భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, కురబలకోట మండల కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్ తదితరులు ఉన్నారు.

భూహక్కు పత్రాలతో యజమానులకు సాంత్వన



శిక్షణ ఇస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

మదనపల్లె టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శాశ్వత భూహక్కు పత్రాలకు ఇంటి యజమానులకు భూరక్షణ, సాంత్వన చేకూరుతుందని డీఎల్‌పీఓ నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో డివిజన్‌లోని 130 మంది పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు స్వమిత్వ శిక్షణ నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వమిత్వ పేరిట గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహిస్తోందన్నారు. సర్వేలో ఇంటి యజమాని స్థలం వివరాలు, ఇంటి కొలతలు ఆధునాతన పద్ధతిలో సర్వే నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో వెళ్లినప్పుడు రోవర్‌తో నిర్ధిష్టంగా సర్వే నిర్వహించాలన్నారు. క్యూజీఎస్ సాఫ్ట్‌వేర్‌తో సర్వే నిర్వహించి ఇంటి యజమానికి భూహక్కు పత్రాలు ఇస్తారన్నారు. వీటితో బ్యాంకు రుణాలు వెంటనే తీసుకోవచ్చన్నారు. స్వమిత్వ జిల్లా నోడల్ అధికారి బయ్యారెడ్డి, సర్వేహెడ్ వినోద్‌కుమార్, సమీర్ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

కేసుల సత్వర పరిష్కార వేదిక జాతీయ లోక్‌అదాలత్ : జూనియర్ సివిల్ జడ్జి గురుఅరవింద్



వాల్మీకిపురం కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గురుఅరవింద్

వాల్మీకిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో కక్షలతో జీవితాలను దుర్భరం చేసుకోకుండా రాజీ మార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు చక్కటి వేదిక జాతీయ లోక్ అదాలత్ అని వాల్మీకిపురం న్యాయ సేవాధికార చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి గురుఅరవింద్ పేర్కొన్నారు. శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ కక్షిదారులు అవగాహన కలిగి కేసులతో కాలయాపన చేసుకుండా రాజీ ద్వారా పరిష్కరించుకుని ప్రశాంత జీవితం గడపాలన్నారు. పోలీసు అధికారులు, న్యాయవాదులు ఈ విషయం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, న్యాయ స్థానాల సేవలను బాధ్యతగా తెలియజేయాలన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు తదితర వాటికి సంబంధించిన మొత్తం 133 కేసులు, రూ. 32,10,959నగదు రికవరీని పరిష్కరించారు. లోక్‌అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

150 కేసులు పరిష్కారం

తంబళ్లపల్లె, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి శిరీష్ ఆధ్వర్యంలో శనివారం మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు వర్గాల కక్షిదారుల రాజీకి ఆమోద యోగ్యమైన 150 కేసులను పరిష్కరించారు. సీసీ ఐపీసీ 7 కేసులు, ఓఎస్ 2, ఈపీ 1, ఎస్‌టీసీ అడ్మిషన్లు 140 కేసులను పరిష్కరించారు. దీంతో రూ.12,57,933లు నగదును రికవరీ చేసినట్లు వివరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రెడ్డి, న్యాయవాదులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కక్షదారులు పాల్గొన్నారు.

87 కేసులు పరిష్కారం

పీలేరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో 87 కేసులు పరిష్కారమయ్యాయి. ఈకేసుల్లో రూ.43,10,895లు చెల్లింపులు జరిగినట్లు 11వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ శ్రీనివాస రావు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి రవి, ఏపీపీ శారద, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



పెద్దతిప్పసముద్రం మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్ర రోజున శివపార్వతుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. శివాలయంలో స్వామి వారికి ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి స్వామి వారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు రాగా తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. బి.కొత్తకోటకు చెందిన ఆకుల మల్లికార్జున, శివాలయ సేవకులు సూర్యనారాయణ, సుబ్రమణ్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

రామసముద్రం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా గ్రామీణ రోడ్లు, మురికికాల్వల ఏర్పాటు, పేదలకు ఇళ్ల స్థలాలు, విద్య, వైద్య మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు ఆధ్వర్యంలో శనివారం మండలంలో ఏర్పాటు చేసిన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రామసముద్రం-మదనపల్లె రోడ్డు విస్తరణ చేయాలని, హంద్రీనీవా జలాలు మండలంలోని చెరువులకు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, మండల యువత అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, నేతలు ప్రదీప్‌రెడ్డి, భరత్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడు, బందెల శివన్న, రమేష్, శీనప్ప, ఈశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న చలో విజయవాడ విజయవంతం చేయండి

మదనపల్లె అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్స్ 11న చేపట్టబోయే చలో విజయవాడ మహాధర్నాకు సిద్ధం కావాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. మదనపల్లె మున్సిపల్ కమిటీ సహావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న పారిశుధ్య, ఇతర కార్మికుల సమస్యలు పరిష్కారించాలని, పారిశుధ్య కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరిపి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి పౌరుగు సేవల సిబ్బందిని ప్రైవేటు ఏజన్సీలకు కట్టబెట్టే చర్యలు వెంటనే విస్మరించి పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మస్తాన్, ట్రెజరర్ దేవేంద్ర, ముబారక్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం - నిందితుడు అరెస్టు

ములకలచెరువు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లెలో శనివారం దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. బస్టాండులో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో నిందితుడు కుళాయప్పను అరెస్టు చేసినట్లు చెప్పారు. అతని వద్ద నుంచి రూ.4150 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మదనపల్లె అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని వాల్మీకి, బోయ సంఘాలు 56 ఏళ్లగా పోరాటాలు సాగిస్తున్నారని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నేతలకు ఎన్నికల సమయంలో మాత్రం వాల్మీకులను మభ్యపెట్టి గద్దె ఎక్కిన తరువాత ఇచ్చిన హామీలను మర్చిపోవడం పరిపాటిగా మారిందన్నారు. ప్రతి ఎమ్మెల్యే, ఎంపీలు పార్లమెంట్, అసెంబ్లీలో మాట్లాడి తమ కులానికి న్యాయం చేయాలన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి వాల్మీకుల సమస్యలపై గళమెత్తడం, వాల్మీకులను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని మాట్లాడడం హర్షణీయమన్నారు. గంపల గంగురాజు, యు. శంకర, నరసింహులు, సహదేవ పాల్గొన్నారు.

డిజిటల్ విద్యాబోధనలే ఉత్తమం



అటానమస్ వర్క్‌షాప్‌లో డిజిటల్ బోధనలపై అధ్యాపకులకు సూచనలిస్తున్న ఏపీఎస్‌హెచ్‌ఈసీ అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాథ్యూ

మదనపల్లె టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్‌తో విద్యాబోధనల కన్నా డిజిటల్ పరికరాలతో విద్యాబోధనలే ఉత్తమమని ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాథ్యూ అన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు అటానమస్ కళాశాలల్లో నిర్వహించాల్సిన విద్యాబోధనలు, సిలబస్ తయారీ విధానం, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటింపుపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్ ముగిసింది. ముఖ్యఅతిథి శ్రీరంగం మాథ్యూ మాట్లాడుతూ అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వుండాలన్నారు. పరిశోధనలు, ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కరెస్పాండెంట్ ఆర్. గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శనైశ్వరుడికి మహాతైలాభిషేకం



ధర్మపథంలో విశేష పూజలందుకుంటున్న శనైశ్వరస్వామి

వాల్మీకిపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మపథం సమూహాలయంలో శనైశ్వరుడికి మహా తైలాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, శని దోష నివారణార్థం మహాకాల శని మృత్యుంజయ హోమం నిర్వహించారు. వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో శనివారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం శనైశ్వరుడికి విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలి

పెద్దమండ్యం, మార్చి 8(ఆంధ్రజ్యోతి) విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పెద్దమండ్యం హైస్కూల్ హెచ్ఎం విజయసింహారావు పేర్కొన్నారు. పెద్దమండ్యం హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశాలు జరిగాయి. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి దశలో టెన్త్ జీవితం మరపురాని ఘట్టమన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటపోటీల్లో విజేతలకు జ్ఞాపికలను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అందజేశారు. పాఠశాల కమిటీ చెర్మన్ సునీత కూటమినేతలు గంగాధర, మహేశ్వర, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష పూజలు



కలకడ, మార్చి8(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వేకువజామునే ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకు తదితర పూజ కార్యక్రమాలను జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సమీప గ్రామాల ప్రజలు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

గుర్రంకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై 10వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా రైతు సంఘం సభ్యుడు రమేష్ బాబు కోరారు. ఆదివారం గ్రామాల్లో తిరిగి కరపత్రాలను అందజేశారు. సభ్యులు వెంకటరమణరెడ్డి, బాబు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

కలకడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడు వేమనారాయణను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎర్రకోటపల్లె పంచాయతీ గొల్లపల్లె వాసి వేమనారాయణ భూతగాదాల విషయమై అదే గ్రామానికి చెందిన సుధాకర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనపై గత నెల 7వ తేదీన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో నిందితుడిని కోన క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండు నిమిత్తం వాల్మీకీపురం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది హరిబాబు, రమేష్ బాబు, కరుణాకర్, రమేష్‌లు పాల్గొన్నారు.

వేడుకగా పట్టాభి రాముడి విగ్రహ ప్రతిష్ఠ

పెద్దమండ్యం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వెలిగల్లు పంచాయతీ పాపాతాత గారిపల్లిలో పట్టాభిరామాలయంలో సీతాసమేత పట్టాభి రామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. పాపాతాతగారిపల్లిలో రామాలయం జీర్ణోద్ధరణ జరిగినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ప్రజలు సమష్టి కృషితో నూతన దేవాలయం, పట్టాభిరాముడి ప్రాణ పతిష్ఠ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులకు ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు. తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.